

8 పేజీలు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
ఆదివారం | 03 డిసెంబర్ 2023 | www.navatelangana.com



11 స్థానాల్లో.. పైచేయి ఎవరిదో!

- వార్ వన్‌సైడ్ అంటున్న కాంగ్రెస్
- మెజార్టీ స్థానాలొస్తాయంటున్న బీఆర్ఎస్
- ఓటరు నాడిపై విభిన్న అంచనాలు
- సిద్దిపేట మినహా పది స్థానాల్లో మార్జిన్‌తోనే గెలుపు
- సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ గాలి
- సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధిక్యం

మిగతా 2లో..

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గాలి వీచింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నాలుగు స్థానాల్లో గెలువగా సంగారెడ్డిలో కాంగ్రెస్ గెలిచింది. ఈ ఎన్నికల్లో అందుకు భిన్నమైన ఫలితాలు రానున్నాయి. కాంగ్రెస్‌కు నాలుగు స్థానాలు బీఆర్ఎస్‌కు ఒకటి రావచ్చంటున్నారు. సిద్దిపేట జిల్లాలో నాలుగు స్థానాలకుగాను గత ఎన్నికల్లో దుబ్బాకలో బీజేపీ గెలువగా మూడు చోట్ల బీఆర్ఎస్ గెలిచింది. ఈసారి కూడా బీఆర్ఎస్ నాలుగు స్థానాల్లో గెలిచే అవకాశముంది. కాంగ్రెస్ బోణి కొట్టాలంటే హుస్నాబాద్, దుబ్బాకలో అవకాశముంది. సిద్దిపేట, గజ్వేల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమనే చెప్పాలి. మెదక్ జిల్లాలో రెండు స్థానాల్లో గతంలో బీఆర్ఎస్ గెలిచింది. ఈసారి గట్టి పోటీ

నేడే తీర్పు

టిక్..టిక్..టిక్..



- ఓట్ల కౌంటింగ్‌కు ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం
- మూడు జిల్లాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాలు
- నారాయణఖేడ్, అందోల్..
- జహీరాబాద్, పటాన్‌చెరులో 18 టేబుల్స్
- పటాన్‌చెరు, గజ్వేల్‌లో 23 రౌండ్లలో లెక్కింపు
- గజ్వేల్ ఫలితం రాత్రి 8 గంటల తర్వాతే
- కౌంటింగ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్

మిగతా 2లో..

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఓట్ల లెక్కింపుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మూడు జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వగానే ఈవీఎంలను ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోని స్టాంగ్



పాపం శిరీష

- అంగవైకల్యంతో చిన్నారికి కష్టాలు
- భారంగా మారిన పాప మందుల ఖర్చు
- ఆపన్న హస్తం కోసం ఎదిరిచూపులు
- మనసున్న మహారాజులు స్పందిస్తారని ఆశ

వివరాలు 2లో..





లాక్‌డౌన్ ఎత్తేయాలి

- పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

మిగతా 2లో..

నవతెలంగాణ- చేగుంట

చేగుంట మండలం మక్కరాజ్ పేట పరిధిలోని స్ప్రాంటియం ఫెర్రిటిన్ పరిశ్రమ అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని, రెండు నెలల పెండింగ్ వేతనాలు, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమను గత

రోడ్డు ప్రమాదంలో
అన్నాదమ్ముల మృతి

నవతెలంగాణ -పాపన్నపేట

పాపన్నపేట శివారులో బారాకనాల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నాదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్ రెడ్డి కథనం ప్రకారం.. టేక్మాల్ మండల పరిధిలోని హసన్ మమ్మద్‌పల్లి గ్రామానికి చెందిన

మిగతా 2లో..



బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం ఖాయం

ముద్దాయిపేట మాజీ సర్పంచ్ కమాల్‌రెడ్డి

నవతెలంగాణ పుల్కల్



అందోల్ మండలంలో బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం ఖాయమని పుల్కల్ మండలం ముద్దాయిపేట గ్రామ మాజీ సర్పంచ్ కమాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలించిన పాలకులు తాగుబోతుల తెలంగాణ చేశారని తెలిపారు. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. నేటి ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహ భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ గెలుస్తుందని సర్వేలు చెప్పడంతో బీఆర్ఎస్ నాయకుల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.

పాపం శిరీష

నవతెలంగాణ వర్గల్

పిల్లల ఆలనా పాలనా చూడాల్సిన తండ్రి కర్కశంగా మారి కాదన్నాడు. అంగవైకల్యం ఉందని తల్లిని, పిల్లలను ఇంట్లో నుంచి గెంటేశాడు. తల్లిగారి ఇంట్లో తలదాచుకుంటు పాప వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న ఓ తల్లి విషాద గాథపై నవతెలంగాణ ప్రత్యేక కథనం... వర్గల్ మండలంలోని తునికి ఖల్సా గ్రామానికి చెందిన గొడుగు ఇస్తరి గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పని చేసేవాడు. అతనికి ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కుతురైన రేణుకను సికింద్రాబాద్ దగ్గరలో ఉండే ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేసాడు. వారికి మొదటి సంతానంగా ఓ అమ్మాయి పుట్టింది. ఆ అమ్మాయి పేరు శిరీష(7). ఈ పాపకి పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నది. అంగవైకల్యం ఉన్న అమ్మాయి పుట్టిందని భార్యతో రోజు గొడవపడేవాడు. అంగవైకల్యం ఉన్న అమ్మాయితో పాటు మరో ఇద్దరు సంతానం కలిగారు. పెద్ద అమ్మాయి శిరీష అంగవైకల్యం తో పాటు ఫీట్స్, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయి. పాప వైద్యం కోసం ప్రతినెలా రూ 6 వేలు ఖర్చు అవుతుందని రోజూ భార్యతో గొడవ పెట్టుకొని ఓరోజు ఇంట్లో నుంచి గెంటేశాడు. భర్త వెల్లగొట్టడంతో రేణుక తల్లిగారి ఇంటికి వచ్చి తలదాచుకుంటున్నది. ముగురు పిల్లను పోషించడానికి నరకయాతన పడుతోంది. రేణుక తండ్రి ఇస్తరి ఈ మధ్యకాలంలో మరణించాడు. తండ్రి మరణంతో ఈ కుటుంబానికి మరిన్ని కష్టాలు తొడయ్యాయి. శిరీషకు వైద్యం చేయించడం కోసం ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిరీష ఆరోగ్యం చూసుకుంటూ గ్రామంలోని స్కూల్‌లో రేణుక సహాయకురాలిగా పని చేస్తోంది. ప్రతినెలా శిరీషకు రూ.6 వేలు మందుల ఖర్చు అవుతోంది. మరో ఇద్దరి పిల్లలు ఉండడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, తన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, దాతలు ఎవరైనా తన కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని ప్రార్థిస్తున్నారు. సహాయం చేసేవారు 7330665413 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నేడే జహీరాబాద్ శాసనసభ ఓట్ల లెక్కింపు

నవతెలంగాణ జహీరాబాద్

పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సటీలో జహీరాబాద్ నియోజక వర్గానికి సంబంధించి మొత్తం 18 టేబుల్స్‌లో 314 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు ఆదివారం నిర్వహిస్తారు. 17 రౌండ్ లలో జహరాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఓట్ల కౌంటింగ్‌కు సంబంధించి రిటర్నింగ్ అధికారి వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముల మృతి

(మొదటి పేజీ తరువాయి)

కున్సోత్ చిన్య(45), దేవ్య(42) బైక్‌పై పాపన్నపేట నుంచి లక్ష్మీనగర్‌కు ధాన్యం విత్తనాలు తీసుకురావడానికి వెళ్తున్నారు. పాపన్నపేట శివారులోని బారాకనాల్(బ్రిడ్జి) వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు అన్నాద మ్ములు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలపై పడి రోదించడంతో అక్కడ ఉన్న ప్రయాణికులు కంటతడి పెట్టుకున్నారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లాక్‌డౌన్ ఎత్తేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మూడు సంవత్సరాలుగా అక్రమంగా మక్కరాజుపేట గ్రామంలో ఉన్న రైస్ మిల్లులో నడుపుతూ నాలుగు రోజుల క్రితం అక్రమంగా మూసి వేసిందన్నారు. 2020 డిసెంబర్ వరకు మాసాయిపేట మండల పరిది లోని రామంతపుర్ శివారులో నడిపి అక్కడ పరిశ్రమ స్థలం అమ్మివేసిన సందర్భంగా వేతన ఒప్పందం చేసి చేగుంట మండలంలో పరిశ్రమ కొనసాగిస్తామని, పరిశ్రమ ఎం.డి, మరో డైరెక్టర్ రాత పూర్వక ఒప్పందం చేశారన్నారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సంగారెడ్డి వద్ద వివాదం వేయగా అక్కడికి హాజరు కాకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులను మోసం చేస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, కార్మికులు బలేష్, యాదగిరి, లక్ష్మన్, వెంకట్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడే తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

రూముల్లో భద్రపరిచారు. ఆదివారం మూడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు షురూ ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. ఆ బ్లాక్‌లో ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్లు, ఈవీఎంల సంఖ్యను బట్టి 14 నుంచి 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఆయా టేబుల్స్ సంఖ్యను బట్టి 17 నుంచి 23 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు సాగనుంది. ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల యంత్రాంగం ఆయా కేంద్రాలకు శనివారం రాత్రి వరకే చేరుకున్నారు. ఉదయం నుంచే ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలింగ్ బూత్‌ల వారిగా ఈవీఎంలను టేబల్స్ వద్దకు తెచ్చి ఆయా అభ్యర్థుల వారిగా వచ్చిన ఓట్లను లెక్కించనున్నారు.

ఓట్లు, ఈవీఎంలను బట్టి టేబుల్స్

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధం చేశారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు చెందిన ఓట్లను పటాన్‌చెరులోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారిర డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్లను లెక్కించేందుకు ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. అదే విధంగా మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల ఓట్లను లెక్కించేందుకు వైపీఆర్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు కోసం ఇలా ఏర్పాట్లు చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాలున్నందున ఓట్ల లెక్కింపు కోసం 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు. 17 రౌండ్లలో 192418 ఓట్లను లెక్కించనున్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాల్లో 184974 ఓట్లు పోలైనందున 16 టేబుల్స్‌పై 18 రౌండ్లలో లెక్కిస్తారు. అందోల్ నియోజకవర్గంలో 313 పోలింగ్ కేంద్రాల్లో 211364 ఓట్లు పడ్డాయి. వీటిని 18 టేబుల్స్‌పై 18 రౌండ్లలో లెక్కిస్తారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 405 పోలింగ్ కేంద్రాల్లో 276510 ఓట్లు పోలైనందున వాటిని లెక్కింపు 18 టేబుల్స్‌లో 23 రౌండ్లలో జరగనుంది. జహీరాబాద్‌లో 314 పోలింగ్ కేంద్రాల్లో 207748 ఓట్లు పడినందున 18 టేబుల్స్‌పై 18 రౌండ్లలో లెక్కిస్తారు. సిద్దిపేట నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాల్లో పోలైన 178420 ఓట్లను 14 టేబుల్స్‌లో 20 రౌండ్లలో లెక్కిస్తారు. గజ్వేల్‌లో 320 పోలింగ్ కేంద్రాల్లో పోలైన 231086 ఓట్లను 14 టేబుల్స్‌పై 23 రౌండ్లలో లెక్కిస్తారు. దుబ్బాలో 253 పోలింగ్ కేంద్రాల్లో పోలైన 173366 ఓట్లను 14 టేబుల్స్‌లో 19 రౌండ్లు, హుస్నాబాద్‌లో 304 పోలింగ్ కేంద్రాల్లో పోలైన 204999 ఓట్లను 14 టేబుల్స్‌లో 22 రౌండ్లలో లెక్కిస్తారు. మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లను 14 టేబుల్స్‌లో 20 రౌండ్లలో నర్సాపూర్‌లోని 305 పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లను 14 టేబుల్స్‌లో 22 రౌండ్లలో లెక్కిస్తారు.

ఫలితాల వెల్లడికి మెరుగైన సాఫ్ట్‌వేర్

ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టేబుల్స్‌పై ఈవీఎంల వారిగా ఓట్లను లెక్కించనున్నారు. 14 నుంచి 18 టేబుల్స్ ఏర్పాటు చేసినందున వాటిల్లో ఒక్కో టేబుల్‌కు అలాట్ చేసిన ఈవీఎంల ఓట్లను లెక్కిస్తారు. ప్రతి రౌండ్‌కూ ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాల్ని వెల్లడించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, సర్వీస్ సిబ్బంది ఉంటారు. వీరితో పాటు ఆయా అభ్యర్థుల తరుపున ఒక్కో ఏజెంట్ కూడా లెక్కింపు ప్రక్రియలో ఉంటారు. ప్రతి ఈవీఎంలను సీరియల్ ప్రకారం టేబుల్స్‌పైకి తీసుకొచ్చి మొత్తం పోలైన ఓట్లు ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లకు సరిపోయినట్లు నిర్ధారించిన తర్వాతనే మరో ఈవీఎంను తెచ్చి ఓట్లను లెక్కిస్తారు.

144 సెక్షన్ అమలు

సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల ఓట్లను లెక్చించే పటాన్‌చెరులోని గీతం యూనివర్సిటీలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వల్ల 144 సెక్షన్ అమల్లో ఉంది. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేవారు. అదే విధంగా సిద్దిపేట జిల్లాలోని హిందూరు ఇంజనీరింగ్ కళాశాలలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు. ఇక్కడ కూడా 144 సెక్షన్‌అమల్లో ఉంటుంది. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వైపీఆర్ కళాశాల వద్ద కూడా 144 సెక్షన్ ఉంటుంది.

గజ్వేల్ ఫలితం రాత్రి 8 గంటల తర్వాతే

సీఎం కేసీఆర్ పోటీ చేసిన గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధికంగా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 44 మంది పోటీ చేశారు. దీంతో ఎక్కువ ఈవీఎంలను ఏర్పాటు చేశారు. అక్కడ పోలైన ఓట్లను 14 టేబుల్స్‌లో 23 రౌండ్లలో లెక్కిస్తారు. దీంతో మొత్తం ఓట్లు లెక్కించి తుది ఫలితం వెల్లడించడానికి రాత్రి 8 అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌జీవన్‌పాటిల్ వెల్లడించారు.

టిక్...టిక్...టిక్...అంటూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన సమయం రానే వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు వెడువడనుంది. ఓట్ల లెక్కింపుతో తీవ్ర ఉత్కంఠకు తెరపడనుంది. ఈవీఎంలో నిక్షిప్తమైన ఓటరు నాడి ఏమిటో తేలనుంది. ఓటరు మహాశయులు ఎవరి పక్షం వహించారో స్పష్టం కానుంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఒక పార్టీకి జోష్ నింపగా మరో పార్టీకి షాక్ ఇచ్చాయి. అవన్నీ అంచనాలు మాత్రమే. నిజమేంటో నిప్పులా ఈవీఎంలలో బయటపడనుంది. ఓట్ల లెక్కింపు కోసం సంగారెడ్డి జిల్లాలో గీతం యూనివర్సిటిలో సిద్దిపేట జిల్లాలో ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో మెదక్ జిల్లాలో వైపీఆర్ కళాశాలలో ఏర్పాటు చేశారు.

11 స్థానాల్లో... పైచేయి ఎదరిదో..!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నది. కొద్దితేడాతో గులాబీకే ఎడ్జ్ ఉన్నట్లు చెబుతున్నారు.

నారాయణఖేడ్ నువ్వానేనా

నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు నువ్వానేనా అన్నట్లుగా పోటీ పడ్డాయి. సంజీవరెడ్డికి ప్రభుత్వ వ్యతిరేకత కలిసి రాగా బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డికి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుబాటులో ఉండి చేసిన సేవలు అనుకూలించాయి. కంగ్టి, మనూరు మండలాల్లో హస్తంకే మెజార్టీ రానుంది. కల్హేర్, నిజాంపేట, సిర్గాపూర్ మండలాల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ రానుంది. నారాయణఖేడ్ పట్టణం, మండలంలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో చూడాలి. ఇద్దరిలోనూ గెలుపు ధీమా వ్యక్తమవుతోంది. సంజీవరెడ్డి గెలుపుకు అవకాశాలున్నాయనే చర్చ ఉన్నప్పటికీ భూపాల్‌రెడ్డి కూడా గెలుస్తారనే అభిప్రాయముంది. ఇక్కడ బీజేపీ, బీఎస్పీలు పెద్దగా ప్రభావం చూపకపోయే సరికి కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా ఓటర్లు చీలిపోయినందున ఎవరు గెలిచినా మెజార్టీ స్వల్పంగానే ఉంటుంది.

అందోల్‌లో గెలుపెవరిదో..?

అందోల్ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంలో సీనియర్ కాంగ్రెస్ నేత దామోదర రాజనర్సింహ, బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ మధ్య తీవ్ర పోటీ కొనసాగింది. కాంగ్రెస్‌కు వీచిన గాలి, నిరుద్యోగుల తోడుతో పాటు దామోదర ఉప కులం కూడా ప్రబావం చూపింది. దీంతో దామోదర్‌కు గెలుపు అవకాశాలేర్పడ్డాయని చెప్పాలి. చంటి క్రాంతి కిరణ్‌కు స్థానికుడనే ఆంశంతో పాటు కింది స్థాయి జనాలకు కూడా అందుబాటులో ఉన్నాడనేది కలిసొచ్చింది. ఇద్దరికీ గెలుపు అవకాశాలున్నప్పటికీ కాంగ్రెస్ బయటపడుతుందనే చర్చ ఎక్కువగా వినిపిస్తుంది. బీజేపీ అభ్యర్థి బాబుమోహన్, బీఎస్పీ అభ్యర్థి ముప్పారం ప్రకాశ్ ఇద్దరు కూడా జెండా ఎత్తేయడంతో దామోదర్, చంటి క్రాంతికిరణ్ అన్నట్లుగా ఓట్లు పడ్డాయి.

జహీరాబాద్ తీర్పు విలక్షణమే

జహీరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్యరావు, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రఖేఖర్‌రావు పోటీ పడ్డారు. ప్రబుత్వ వ్యతిరేకత బలంగా ఉండడంతో పోలింగ్‌కు రెండు రోజుల ముందు వరకూ కాంగ్రెస్ గాలి బలంగా వీచింది. దీంతో చంద్రశేఖర్ గెలుపుకు దారులు పడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన బీఆర్ఎస్ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట మార్క్ రాజకీయాలు చేశారంటున్నారు. పోల్‌మేనేజ్‌మెంట్‌తో పరిస్థితుల్ని అనుకూలంగా మార్చుకున్నారనే చర్చ ఉంది. ప్రియాంక సభ ప్రభావం కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. దీంతో ఇందులో ఏది వర్కట్ అయితే వాళ్లే గెలిచే అవకాశముంది.

సంగారెడ్డిలో మిశ్రమ పరిస్థితి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి వర్సెస్ చింత ప్రభాకర్ మధ్య సాగిన పోరులో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ప్రభుత్వ వ్యతిరేకత బలంతో పాటు జగ్గారెడ్డి మాస్ లీడర్ కావడం కలిసొచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రబాకర్ సైతం తనదైన శైలిలో విస్తృత ప్రచారంలో సభల్లో ప్రభావం చూపారు. అయినా జగ్గారెడ్డి వైపే ఓటర్లు ఉన్నట్లు కనిపించింది. దీంతో చివర్లో బీఆర్ఎస్ అప్రమత్తమై పోల్‌మేనేజ్‌మెంట్‌కు దిగింది. ఆ రెండు రోజులు చేసిన వర్కౌట్ ఫలిస్తే చింత గెలుపు ఖాయమనే అభిప్రాయముంది. ఎవరు ఏది చేసినా జగ్గన్న మీద ఉన్న అభిమానమే పనిచేస్తే కాంగ్రెస్‌కు ఛాన్స్ ఉండొచ్చు. ఎవరు గెలిచినా వందలు, రెండు వేల మెజార్టే అంటున్నారు.

పటాన్‌చెరులో పోటా పోటీ

పటాన్‌చెరులో బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్ మధ్యనే పోటీ కనిపించింది. బీఎస్పీ అభ్యర్థి నీలం మధు, బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ ఓట్లు రాబట్టినా గెలుపు అంచుకు వెళ్లలేకపోయారు. సీపీఐఎం అభ్యర్థి మల్లిఖార్జున్ సైతం మంచి ఓట్లు తెచ్చుకుంటున్నారు. నీలం మధు అత్యధిక ఓట్లు పొందితే కాంగ్రెస్‌కు నష్టం ఏర్పడుతుంది. కొద్ది పాటి ఓట్లతోనే సరిపెట్టుకుట్టే బీఆర్ఎస్‌కు నష్టం తప్పదు. కాంగ్రెస్‌కు సైలెంట్ ఓటింగ్ వర్కట్ అవనుంది. మహిపాల్‌రెడ్డికి మాస్ ఇమేజ్ కలిసొస్తే గెలవొచ్చు.

సిద్దిపేట జిల్లాలో గులాబీకే పీఠం

గులాబీ దళపతుల్లో ట్రబుల్ సూటర్‌గా ఉన్న హరీశ్‌రావుకే ఓటర్లు పట్టం కట్టారు. గత మెజార్టీ తగ్గినప్పటికీ గెలుపు ఖాయమనే చెప్పాలి. రాష్ట్రమంతటా ప్రభుత్వ వ్యతిరేకత కాంగ్రెస్‌కు కలిసిరాగా సిద్దిపేటలో మాత్రం ఆ ప్రభావం కనిపించలేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ గెలుపు అంచుకు రాలేకపోతున్నారు. బీఎస్పీ అభ్యర్థి చక్రధర్ గౌడ్ ఓట్లు చీల్చినందున హరీశ్‌రావు మెజార్టీ లక్షలోపే ఉండనుంది.

గజ్వేల్‌లో కేసీఆర్ వైపే మొగ్గు

గజ్వేల్‌లో కేసీఆర్‌కు మూడో సారీ ప్రజలు పట్టం కట్టనున్నారు. కామారెడ్డిలో ఎదురీదినప్పటికీ గజ్వేల్‌లో గట్టెక్కనున్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వ వ్యతిరేకత కనిపించినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి సొమ్ము చేసుకోలేకపోయారు. దీంతో ఆయన మూడో స్థానానికే పరిమితం కానున్నారు. బీజేపీ నుంచి ఈటెల రాజేందర్ పోటీ చేసిన కేసీఆర్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. అయినా కేసీఆర్ గెలవనున్నారు.

దుబ్బాక త్రిముఖ పోటీలో కొత్తకే ఛాన్స్

దుబ్బాకలో త్రిముఖ పోటీ జరిగింది. ప్రభుత్వ వ్యతిరేకత కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాసరెడ్డికి అనుకూలించినప్పటికీ కొంత ఓటింగ్ బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు కూడా సిఫ్ట్ అయ్యింది. వీరిద్దరి మధ్య ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ షేర్ అవ్వడంతో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాక్‌రెడ్డికి కలిసిరానుంది. కత్తిపోట్ల తర్వాత ఆయన ప్రచారానికి దూరమయ్యారు. చివరి రెండు రోజులే ఓటర్ల వద్దకొచ్చారు. ముత్యంరెడ్డి కుటుంబం పట్ల ఉన్న ఆధరణ వర్కఅవుట్ అయితే హస్తంకే ఛాన్స్ ఉండనుంది.

హుస్నాబాద్ గడ్డలో ఫిఫ్టి ఫిఫ్టి

కాంగ్రెస్ నుంచి పొన్నం ప్రభాకర్ గెలుస్తానని ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి సతీష్ కూడా హట్రిక్ కొట్టడం ఖాయమంటున్నారు. ఇద్దరి మధ్య తీవ్ర పోటీ కనిపించింది. ప్రభుత్వ వ్యతిరేకత వర్కఅవుట్ అయితే కాంగ్రెస్‌కే ఛాన్స్ అంటున్నారు. సతీష్‌కేమో అభివృద్ధి, అందుబాటులో ఉండడం, లోకల్ కావడం కానిసిరానుంది.

మెదక్ ఛాన్స్‌పై ఉత్కంఠ

పద్మాదేవేందర్‌రెడ్డి మూడో సారి గెలుపు కోసం కష్టపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేకతే కాదు దేవేందర్‌రెడ్డి పట్ల ఉన్న వ్యతిరేకత కూడా నష్టం చేసింది. అయినా అధిగమించి గెలుపు వరకూ నెట్టుకొచ్చారంటున్నారు. కాంగ్రెస్ నుంచి మైనంపల్లి రోహిత్‌రావు శక్తినంతా ఒడ్డారు. కాంగ్రెస్ వేవ్‌తో పాటు మైనంపల్లి కుటుంబానికి ఉన్న ఆధరణ గెలుపుకు దారి తీసే అవకాశంలేకపోలేదు.

నర్సాపూర్‌లో మేదంకే మొగ్గా..?

బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి వర్సెస్ అవుల రాజిరెడ్డి మధ్య పోటీ ఉత్కంఠగా సాగింది. ప్రభుత్వ వ్యతిరేకతను రాజిరెడ్డి వంద శాతం ఉపయోగించుకోవడంతో బీఆర్ఎస్ ఎదురీదాల్సి వచ్చింది. డబ్బుల ప్రభావం కూడా తీవ్రంగా కనిపించింది. సునీతాలక్ష్మారెడ్డికి కూడా కాంగ్రెస్‌లో మంత్రి చేసినందున గ్రామాల్లో పట్టుండడంతో అది కొంత కలిసొచ్చింది. తెగబడి డబ్బు ప్రభావం చూపడంతో ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు ప్రయత్నించారు. కొంత మేడంకే ఎడ్జ్ ఉండొచ్చంటున్నారు.

టెన్షన్ టెన్షన్..

- అంతుచిక్కని పబ్లిక్ పల్స్
- ఈవీఎంలలో భవితవ్యం
- గెలుపు ధీమాలో అభ్యర్థులు
- నేడే కౌంటింగ్



నవతెలంగాణ-మెదక్

అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. పోలింగ్ పూర్తి కావడంతో పబ్లిక్ పల్స్‌పై ఉత్కంఠత నెలకొంది. నేడు కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో ఈవీఎంలలో ఉన్న భవితవ్యం విషయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రజా తీర్పుపై విశ్లేషిస్తున్నారు. ఓ వైపు టెన్షన్ పడుతూనే ఎవరికి వారు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. మెదక్ లో 13 మంది, నర్సాపూర్ లో 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లాలో మొత్తం 4.40,341 లక్షల ఓటర్లు ఉండగా, మెదక్ నియోజకవర్గంలో 216748, నర్సాపూర్ నియోజకవర్గంలో 223593 ఓటర్లు ఉన్నారు. గత నెల జరిగిన పోలింగ్‌లో మెదక్‌లో 274, నర్సాపూర్‌లో 305 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలో రెండో స్థానంలో అత్యధికంగా జిల్లాలో 86.69 శాతం పోలింగ్ జరిగింది. మెదక్ నియోజకవర్గంలో 184915 ఓట్లు నమోదు కాగా 85.31 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. అలాగే నర్సాపూర్ నియోజకవర్గంలో 196841 ఓట్లు నమోదు కాగా, 88.04 శాతం ఓట్లు పోలయ్యాయి.

నేడు కౌంటింగ్..

మెదక్ జిల్లాలో జరిగిన మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠత నెలకొంది. ఆదివారం ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలంలోని వైపిఆర్ కళాశాలలో కట్టుదిట్టమైన భద్రత నడుమ జరుగనుంది. మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుల్స్, 20 రౌండ్స్, నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలకు14 టేబుల్స్ 22 రౌండ్స్ ఏర్పాటుచేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేశారు.తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్ వంటి అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

పబ్లిక్ పల్స్‌పై ఉత్కంఠ

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అసెంబ్లీ ఎన్నికల గెలుపు విషయంలో పబ్లిక్ పల్స్‌పై ఉత్కంఠ నెలకొంది. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన టీఆర్ఎస్ పార్టీకి ప్రజలు రెండు సార్లు పట్టం కట్టి బ్రహ్మరథం పట్టారు. అయితే గతంలో జరిగిన రెండు ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నిక విశిష్ఠతను సంతరించుకుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గత ఎన్నికల్లో ప్రజల్లో ఉన్న తెలంగాణ వాదం జోష్.. ప్రస్తుత ఎన్నికల్లో తగ్గిపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. నీళ్ళు, నిధులు, నియామకాల పేరిట రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుందనే విమర్శలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను ప్రలోబ పెట్టెందుకు నగదు, మద్యం పంపిణీ చేసినప్పటికీ ఓటరు నాడిని గుర్తించ లేకపోయారు. సర్వేలు చేసిన సంస్థలకు సైతం అంతుచిక్కకుండా ఓటర్లు వ్యవహరించారు. ఓటు నా హక్కు అనే నినాదంతో ఎవరికి ఓటు వేశారు అనే విషయంలో చాలా వరకు ఓటర్లు స్పష్టత ఇవ్వలేదు. పైబ్లిక్ పల్స్ ఏంటో అనే విషయం తెలియక ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు నాయకులు టెన్షన్ పెడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మనసులో టెన్షన్ పడుతూనే అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గంటల్లో ప్రజా తీర్పు బహిర్గతం కానుండటం ఆసక్తి వ్యక్తమవుతోంది.

నిర్లక్ష్యం నీడలో నిఘా నేత్రాలు..!

- పైతరలో పనిచేయని సీసీ కెమెరాలు
- పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు





నవతెలంగాణ-కొల్చారం

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుల పెట్టు.. తమ కళ్ల ఎదుట చీమ చిటుక్కుమన్నా పసికట్టే శక్తి వాటి సొంతం.. వాటి కంటి చూపులోంచి ఏ ఒక్క నేరస్థుడు తప్పించుకోలేడు.. పోలీసులు పెట్రోలింగ్ చేయకపోయినా అవి మాత్రం నిరంతరం పెట్రోలింగ్ చేస్తూనే ఉంటాయి.. అలాంటి సీసీ కెమెరాల నిర్వహణపై అధికారులు, పోలీసులు శ్రద్ధ వహించక పోవడంతో నిందితులు పోలీసులకు ఆలస్యంగా చిక్కుతున్నారు. వివరాల్లోకి వెళితే.. కొల్చారం మండలంలోని పైతర గ్రామంలో గత నాలుగు సంవత్సరాల క్రితం దాతల సహాయంతో 12 సీసీ కెమెరాలను పంచాయతీ పాలక వర్గం ఏర్పాటు చేసింది. అయితే గత కొంత కాలంగా నిర్వాహణ లోపంతో అవి పనిచేయడం లేదు. దీంతో గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, హత్యలకు తావిస్తోందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అతితక్కువ కాలంలోనే గ్రామంలో డబ్బు కోసం ఇద్దరి దంపతులను దారుణంగా హత్యలు చేసిన ఉలికిపాటు నుంచి గ్రామస్తులు ఇప్పటి వరకు తేరుకోలేదు. ఇద్దరిని దారుణంగా హత్య చేసిన నేరస్తులను అప్పట్లో జిల్లా పోలీసు యంత్రాంగం పట్టుకోవడానికి తీవ్ర అవస్థలు పడిన విషయం తెలిసిందే. నాడు సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే నేరస్తులను పట్టుకోవడంలో ఆలస్యం జరిగేది కాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో ప్రజలకు ఉండాల్సిన కనీస భద్రతా చర్యలు లేవన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గస్తీ కూడా నామమాత్రంగా లేదన్న విమర్శలున్నాయి. ఇలా వివిధ అంశాలలో నిఘా కొరవడంతో ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పోలీసు యంత్రాంగం చొరవ తీసుకుని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మట్టిని తరలిస్తున్న వాహనం సీజ్



నవతెలంగాణ-నంగునూరు

ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామం శివారులో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు లారీల్లో మట్టిని తరలించగా ఒక్క లారీని మాత్రమే పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా భారీ ఎత్తున మట్టిని తరలిసున్నారని ఆరోపణలు రావడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ విషయమై పూర్తి వివరాలను కోరగా, తాము ఎన్నికల విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలో జాతీయ రహదారి 44పై శనివారం సాయంత్రం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. జప్తి శివనూర్ వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జ్ పనులు నడుస్తున్న క్రమంలో, అక్కడ నిర్మాణ పనులు చేస్తున్న క్రేన్‌ను పెద్ద తాండా నివాసి అయిన నేనావత్ బాషా(34) తన ద్విచక్ర వాహనం (టీఎస్ 35 ఏ 1968)పై రామాయంపేట నుంచి నార్సింగి వైపు అతి వేగంగా వస్తూ క్రేన్‌ను ఢీకొట్టాడు. బాషా తలకు తీవ్ర గాయాలవగా, స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో జాతీయ రహదారి 44పై నార్సింగి పట్టణం నివాసి తిప్పరబోయిన నరేష్ (14) నార్సింగి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో వాలీ బాల్ ఆడి ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో జాతీయ రహదారి దాటుతుండగా చేతిలోని బాల్ జారి రోడ్డుపై పడిపోయింది. బాల్‌ను పట్టే క్రమంలో రోడ్డుపై నడుస్తున్న వాహనాలను పట్టించుకోకుండా రోడ్డుపై వెళ్లగా, హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు (టీఎస్ 16ఈఎఫ్ 0265) అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నరేష్ తలకు తీవ్ర గాయం కాగా స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.





శ్రీ సీతా సమేత అభయ రామచంద్రస్వామి తృతీయ వార్షికోత్సవం

నవతెలంగాణ- వెల్దుర్తి



మండల పరిధిలో ఉప్పు లింగాపూర్ గ్రామంలో శ్రీ సీతా సమేత అభయ రామచంద్రస్వామి తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మాధవానంద స్వామి రంగంపేట గారి అనుగ్రహమ ఆశీస్సులతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యామవరపు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వర పూజ, శాస్తి వాచనం, అఖండ దీపా స్థాపన, రుత్వికరణ, ఆవహిత స్థాపిత దేవతా స్థాపన, హవనం, పూర్ణహుతి శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అభిషేకం, షోడోపచార పూజ, రుత్విక్ సన్మానం, తీర్థ ప్రసాద వితరణ, వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సర్పంచి పంచ భాగ్యమ్మ భూపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో ప్రత్యేక హెూమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

కోరంపల్లిలో మొసళ్ల కలకలం

నవతెలంగాణ-టేక్మాల్



మంజీరా పరిహక ప్రాంతమైన కోరంపల్లి గ్రామంలో మూడు మొసళ్లు కలకలం సృష్టిస్తున్నాయి, గ్రామస్తులు, పశువుల కాపర్లు తెలిపిన వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మంజీరా పరిహక ప్రాంతంలో నదీ తీరాన మూడు మొసళ్లు కనిపించాయని పశువుల కాపర్లు సర్పంచ్ శ్రీనివాస్‌కు తెలపడంతో, హుటాహుటిన గ్రామస్తులతో కలిసి మంజీరా నది ఒడ్డుకు చేరుకున్నారు. ఇసుకమేటలో మొసాళ్లు సేద తీరుతున్న దృశ్యాన్ని చూసి పశువుల కాపలతో మాట్లాడారు. మంజీరా తీరం వద్దకు ఎవ్వరు కూడా పశువులను తీసుకొని పోకూడదని గ్రామంలో దండోరా వేయించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారాన్ని అందించి మొసళ్లను ఈ ప్రాంతం నుంచి తరలించాలని విన్నవించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ సోమవారం వరకు వేచి ఉండాలని అప్పటివరకు ఎవరు మంజీరా తీరం వద్దకు వెళ్లొద్దని సూచించారని తెలిపారు.

సైలెంట్ ఓటుతో కాంగ్రెస్ విజయం ఖాయం

జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్



నవ తెలంగాణ-కౌడిపల్లి

తొమ్మిది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పార్టీపై వ్యతిరేకతతో సైలెంట్ ఓటు జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు నిరుపేద కుటుంబాలకు అందుతాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే మొదటిగా రైతు రుణమాఫీపై తొలి సంతకం ఉంటుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలుగుతుందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. అర్హులైన వారికి వృద్ధాప పింఛన్లు ఇస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు.

రుణమాఫీ కాకపోవడం.. అధికార పార్టీకి నష్టమా?

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కలగకపోవడం అధికార పార్టీకి శాపంగా మారనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలో ముగ్గురు నుండి పది మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. మిగతా వారికి ఫోన్లకు మెసేజ్‌లు మాత్రమే వచ్చాయి. డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా జహీరాబాద్ నియోజకవర్గంలోన కొత్తూరు గ్రామంలో గల కెనరా బ్యాంకులో చెరుకు రైతులు ఎక్కువ సంఖ్యలో రుణాలు పొందారు. రుణమాఫీ కోసం నిత్యం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుతున్నా ఫలితం లేకుండా పోతోంది. రైతులు జమానతు ఇచ్చిన వ్యక్తులకు బ్యాంకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ చేశామని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ సరైన ఆదేశాలు బ్యాంకులకు రాకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. తాను ఓ రైతుకు జమానతు ఇచ్చినందుకు నా పెన్షన్ ఆపుతున్నామని బ్యాంకు అధికారులు నోటీసు పంపారని చంద్రప్ప తెలిపారు. కొత్తూరు గ్రామంలోని కెనరా బ్యాంకు అధికారులు ఇష్టం వచ్చినట్లు పెన్షన్లను ఆపడంతో బతుకులు దుర్భరంగా మారుతున్నాయని తెలిపారు.

గజ్వేల్ విజేతదే పాలకపక్షం!

- ఈ సెంటిమెంటు పునరావృతం అవుతుందా?
- తొలి ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన కేసీఆర్











నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు మొత్తం 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఒక ఉపఎన్నికను కలుపుకుంటే ఇప్పటి వరకూ విజయం సాధిస్తున్న అభ్యర్థుల పార్టీయే అధికారంలోకి రావటం విశేషం. ప్రతి ఎన్నికలోనూ గజ్వేల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే అదే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావటం అన్నది ఆనవాతీగా జరుగుతోంది. ఇదొక సెంటిమెంటుగా ఇప్పటికీ కొనసాగుతోంది. రెండుసార్లు గెలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మూడోసారి పోటీ చేశారు. అధికార పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు అందించిన సంక్షేమ పథకాలతో పాటు సెంటిమెంటు కూడా కలిసి వస్తే హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌తో పాటు గజ్వేల్ పేరు చరిత్రలో నిలుస్తుంది.

గజ్వేల్ ఎన్నికల చరిత్రలో హేమా హేమీలు

నిజాం ప్రభువు లొంగిపోయిన తర్వాత 1952 జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికలో గజ్వేల్ స్థానం నుంచి వామపక్ష పార్టీకి చెందిన పీడీఎస్ పార్టీ అభ్యర్థి పెందెం వాసుదేవ్ అప్పటి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాడపాటి హన్మంతరావుపై 15,024 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. అతర్వాత వరుసగా ఆరుసార్లు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వెంకట స్వామిపై స్థానిక నినాదంతో గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన గజ్వేల్ సైదయ్య విజయం సాధించటం అప్పట్లో సంచలనమైంది. ఆతర్వాత సైదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా సైదయ్య తర్వాత జరిగిన మూడు ఎన్నికలలో 1976 వరకు వరుస విజయాలు సాధించారు. అప్పటి దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీని సినీ నటుడు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి 1983 ఎన్నికలలో పోటీ చేయడంతో అనూహ్యంగా కాంగ్రెస్ కోటలు బీటలు వారాయి. అప్రతిహతంగా విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అప్పుడు గజ్వేల్ టీడీపీ ఎమ్మెల్యేగా అల్లం సాయిలు స్థానిక నాదంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన అల్లం సాయిలు కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే సైదయ్యపై విజయం సాధించారు. అనంతరం అల్లం సాయిలు టిడిపి తీర్థం పుచ్చుకుని ఎమ్మెల్యేగా కొనసాగారు. 1985లో జరిగిన ఎన్నికలో టిడిపి అభ్యర్థిగా బెజ్జం సంజీవరావు విజయం సాధించారు. 1989లో సిట్టింగ్ ఎమ్మెల్యే సంజీవరావుపై కాంగ్రెస్ అభ్యర్థి జె గీతారెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. అప్పుడు ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రి వర్గంలో టూరిజం శాఖ మంత్రిగా గీతార్డడ్డికి చోటు దక్కింది. గజ్వేల్ రాజకీయ చరిత్రలో మంత్రి పదవి గజ్వేల్‌కు దక్కడం ఇదే తొలిసారి.

డీలిమిటేషన్తో జనరల్ నియోజకవర్గంగా గజ్వేల్

ఇన్నేళ్లు ఎస్సీ నియోజకవర్గంగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గం డీలి మిటేషన్లో 2009 అసెంబ్లీ ఎన్నికల నాటికి జనరల్ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. దశాబ్దాలుగా తెరవెనుక రాజకీయాలు నడిపిన స్థానిక నాయకులు, కింగ్ మేకర్లు నేరుగా ఎన్నికల బరిలో తలపడే అవకాశం కలిగింది. కాంగ్రెస్ అభ్యర్థిగా వర్గల్ మండలానికి చెందిన తూంకుంట నర్సారెడ్డి, టిడిపి అభ్యర్థి బూరుగుపల్లి ప్రతాపరెడ్డితో తలపడ్డారు. తొలి జనరల్ స్థానానికి హెూరాహెూరీగా సాగిన పోటీలో తూంకుంట నర్సారెడ్డి 7,176 ఓట్ల మెజారిటీతో ప్రతాప్‌రెడ్డి పై విజయం సాధించారు. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత

తెలంగాణ రాష్ట్రం 2014 ఆవిర్భావం కావడంతో తొలి సారిగా గజ్వేల్ అసెంబ్లీ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీచేసి టిడిపి అభ్యర్థి ఒంటేరు ప్రతాపరెడ్డిపై 19 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2018 ఎన్నికల్లో సెట్టింగ్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ రెండోసారి సైతం కాంగ్రెస్ అభ్యర్థి వంటేరు ప్రతాప్‌రెడ్డిపై 58 వేల పైచిలుకతో మెజార్టీతో కేసీఆర్ విజయం సాధించి రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇక మూడోసారి 2023 ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీలోని నిలబడి తన అదృష్టాన్ని మూడోసారి పరీక్షించుకునేందుకు రంగంలో దిగారు. కాంగ్రెస్ నుండి తూముకుంట నర్సారెడ్డి, బిజెపి నుండి మాజీ మంత్రి ఈటల రాజేందర్ రంగంలో ఉన్నారు. ఎన్నికలు ముగిసి ఆదివారం ఫలితాలు వినబడుతున్న సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి గజ్వేల్ నుండి గెలిచి అధికార పీఠం కైవసం చేసుకుంటే గజ్వేల్ సెంటిమెంటు కొనసాగుతుందని చెప్పాలి. ఒకవేళ తలరాతలు తారుమారయితే గజ్వేల్ సెంటిమెంటు ఇక్కడితో ఒడిసిపోతుందనే చెప్పాలి. ముగ్గురు మధ్య తీవ్రమైన పోటు ఉందని రాజకీయ పరిశీలకులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్, బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ మధ్యనే పోటీ ఉంటుందని అందరూ భావిస్తున్నారు. ఎగ్జిట్ పోల్ మాత్రం కాంగ్రెస్ వైపు చూపుతున్నాయి. గజ్వేల్‌లో గెలిస్తే అధికారం దక్కుతుందనే సెంటిమెంటు కొనసాగుతుందా లేదా అనేది కొన్ని గంటల్లో తేలిపోతుంది.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

సీ.సీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ
సాయుధ బలగాల పహారా
కౌంటింగ్ వద్ద 144 సెక్షన్ అమలు





నవతెలంగాణ హవేలి ఘనపూర్

సాధరణ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ఏర్పాట్లను మెదక్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పరిశీలించారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మెదక్ నర్సాపూర్ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను, ఓట్ల లెక్కింపు కేంద్రాలలోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ, మెదక్-34 నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు,14 టేబుల్స్, 20 రౌండ్స్ ,37 నర్సాపూర్ నియోజక వర్గంలో, 305 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, ఈవీఎం2 పోస్టల్, దాదాపు 22 రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా సెగ్మెంట్ల నుండి ఓట్ల లెక్కింపు కేంద్రమైన, వై పి ఆర్ కళాశాలకు, ఈవీఎంలను తరలించి, జాగ్రత్తగా సరిచూసుకుని, స్ట్రాంగ్ రూంలలోకి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా క్రమపద్ధతిలో అమర్చామన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీ.సీ కెమెరాల ను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో కి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు. 'ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలి' అని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్‌వో రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బంది వున్నారు.

గజ్వేల్‌లో 40 వేల మంది ఓటుకు దూరం

గజ్వేల్‌లో పోలైన ఓట్లు 2,31,086

నవతెలంగాణ -గజ్వేల్ : గజ్వేల్ నియోజకవర్గంలో గురువారం జరిగిన పోలింగ్లో రెండు లక్షల, 31,086 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని రాజకీయ పార్టీలు పోలింగ్ శాతం పెంచేందుకు తీవ్రమైన ప్రయత్నం చేశాయి. 40 వేల మంది పైగా ఓటింగ్లో పాల్గొనలేక పోయారు. వివిధ ప్రాంతాల నుండి ఉద్యోగాలు, వలసలు వెళ్లినవారు ఓటింగ్ రాలేదని తెలుస్తుంది. అయితే కొత్త ఓటర్లు మాత్రం హుషారుతో వచ్చి ఓటింగ్లో పాల్గొన్నారు. గజ్వేల్ నియోజకవర్గం లో మొత్తం ఓటర్లు 2,74,654 ఓట్లు ఉండగా, ఇందులో పోలైన ఓట్లు 2,31,086 ఉన్నాయి. మహిళలు 1,15,191 ఓటింగ్లో పాల్గొనగా1.15,892 పురుషులు పాల్గొన్నారు. ఇతరులు ముగ్గురు ఉన్నారు. పోలింగ్ శాతం 84, 14 వరకు జరిగింది. కాగా గజ్వేల్ నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో 84.22 పోలింగ్ గాక, 2018 లో 88.63 పోలింగ్ శాతం వచ్చింది. ప్రస్తుతం ఎన్నికల్లో 84.14 పోలింగ్ నమోదయింది. 2018 ఎన్నికలకు 40 శాతం పోలింగ్ తక్కువైంది. 2014 ఎన్నికల్లో పోలింగ్ శాతం తో పోలిస్తే ఇప్పుడు జరిగిన పోలింగ్ కు ఆరు శాతం ఎక్కువ తక్కువ ఉంది. అప్పట్లో కెసిఆర్ 19 ఓట్ల పైచిలక ఓట్లతో గెలుపొందారు. ప్రస్తుతం ఆదివారం నిలబడే గజ్వేల్ అసెంబ్లీ ఫలితం సైతం తక్కువ మెజార్టీతోనే అభ్యర్థి భవితం ఉంటుందని దీనిబట్టి తెలుస్తుంది.

విజయం వరించేదెవరినో..!

- నేడు తేలనున్న మానకొండూర్ అభ్యర్థుల భవితవ్యం
- ఓటింగ్ సరళిపై అభ్యర్థుల మల్లగుల్లాలు
- ఆయా పార్టీల శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠ



నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ శాసనసభ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం వరించేదెవరినో అనే ఉత్కంఠ అభ్యర్థుల్లో, ఆయా పార్టీల శ్రేణుల్లో నెలకొంది. ఇక్కడి నుంచి 10 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏర్పుల రసమయి బాలకిషన్, కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో నువ్వా.. నేనా అనే తీరులో పోటీపడ్డారు. నియోజకవర్గంలోని శంకరపట్నం, మానకొండూర్, తిమ్మాపూర్, బెజ్జంకి, గన్నేరువరం, ఇల్లంతకుంట మండలాల్లోని గ్రామ గ్రామాన జరిగిన ఎన్నికల సరళిపై ఆయా పార్టీల అభ్యర్థులు, పార్టీల శ్రేణులు ముఖ్యులతో మల్లగుల్లాలు పడుతున్నారు. గెలుపు అవకాశాలపై భేరీజు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆరు మండలాల్లోని గ్రామాల్లో ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారనే అంశంపై చర్చను చేపట్టిన అభ్యర్థులు, ఆయా పార్టీల ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు ఏ గ్రామంలో ఏ మేరకు తమ పార్టీలకు,తమకు ఓట్లు వేశారనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఏ చోట ఇద్దరు వ్యక్తులు కలిసినా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో.. ఎవరు గెలుస్తారోననే చర్చే మండలంలో కొనసాగుతోంది. మండలాలు, గ్రామాలవారీగా తమకు ఎన్ని ఓట్లు వస్తాయి.. ఏ గ్రామంలో ఎంత మెజార్టీ వస్తుందంటూ బీఆర్ఎస్,కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేస్తూ అనుచరులతో చర్చించుకుంటున్నారు. గెలుపు మనదేనంటూ ఆయా పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

మానకొండూర్ నియోజకవర్గంలో పోటీ పడిన అభ్యర్థుల భవితవ్యం ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర కళాశాలలో చేపట్టే ఎన్నికల లెక్కింపులో తేలనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం, ఫలితాలు సాయంత్రం 5 గంటలలోపు తెలిసే అవకాశాలు ఉన్నాయని సమచారం. అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉండగా, ఆయా పార్టీల అభ్యర్థుల అనుచరులు మీరే గెలుస్తారంటూ మనో ధైర్యాన్ని కల్పిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఆరు మండలాల్లోని ముఖ్యులు, అనుచరులతో గెలుపు,మెజార్టీ అంశాలపై లెక్కలు వేస్తూ చర్చించారు.

ఎన్నికల లెక్కింపుపై అభ్యర్థుల సూచనలు

ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపుపై కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరు నిఘా పెట్టాలంటూ ఆయా పార్టీల శ్రేణులకు అభ్యర్థులు సూచించారు. మండలాలు, గ్రామాల్లోని ఈవీఎంలను ఓపెన్ చేసి లెక్కింపు చేసే ఓట్లను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ లెక్క తప్పకుండా చూడాల్సిన బాధ్యత మీదేనంటూ తమ తమ అనుచరులకు అభ్యర్థులు సూచించినట్టు సమాచారం. విధిగా ఎన్నికల లెక్కింపు కేంద్రాలకు పాస్ లను తెచ్చుకోవాలని,సమయానికి కేంద్రాలకు చేరాలంటూ అయా పార్టీల శ్రేణులకు తెలిపారు.

కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు

ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్‌కు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా 2 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

నేడే కౌంటింగ్

- నియోజకవర్గానికి ఒక హాల్ కేటాయింపు
- ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు
- అత్యధికంగా 23 రౌండ్లు గజ్వేల్, అత్యల్పంగా దుబ్బాక 19 రౌండ్లు









నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లాలోని 4 శాసన సభ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు మొదలు కానుంది. ఇందుకోసం పట్టణ శివారులోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలన్నింటినీ ఇక్కడికే తరలించి, స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజక వర్గాల కౌంటింగ్ సజావుగా సాగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున విశాలమైన 4 హాళ్లను కౌంటింగ్ కోసం ఎంపిక చేశారు. ఒక హాల్‌లో ఒకేసారి 14 టేబుళ్ల మీద 14 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. కౌంటింగ్ టేబుళ్ల వద్ద కౌంటింగ్ సిబ్బందితో పాటు అభ్యర్థులు లేదా వారి కౌంటింగ్ ఏజెంట్లు కూర్చోవడానికి అనువుగా గ్యాలరీలను ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు

ఆదివారం ఉదయం 8గంటలకు అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్ ఓపెన్ చేస్తారు. రౌండ్ల వారీగా ఈవీఎంలను కౌంటింగ్ హాళ్లల్లోకి తీసుకొస్తారు. అదే సమయంలో ఆర్ఓ టేబుల్ వద్ద మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. వీటి లెక్కింపు అనంతరం ఈవీఎంల ఓట్ల లెక్కింపును మొదలు పెడతారు. ఒక్కో హాల్‌లో ఒక నియోజకవర్గానికి సంబంధించిన మొత్తం 14 టేబుళ్లపై 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 14ఈవీఎంలను ఓపెన్ చేస్తారు. అంటే ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. సిద్దిపేట నియోజకవర్గంలో 20 రౌండ్లు, దుబ్బాక నియోజకవర్గం లో 19 రౌండ్లో, గజ్వేల్ నియోజకవర్గం లో 23 రౌండ్లు, హుస్నాబాద్ నియోజకవర్గంలో 22 రౌండ్లలో ఓట్లు లెక్కింపు చేయనున్నారు. కౌటింగ్ ప్రక్రియ ను సజావుగా నిర్వహించడానికి పోలీసులు బందోబస్తుపై దృష్టి పెట్టారు. భారీగా తరలివచ్చే ఆయా పార్టీల కార్యకర్తలను అదుపులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ విభాగాల వారీగా గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. కౌటింగ్ ప్రక్రియను పూర్తిగా రికార్డు చేసేలా గదుల్లో సీసీ కెమెరాలతో పాటు వీడియో గ్రాఫర్ లను అందుబాటులో ఉంచుతున్నారు.

నియోజక వర్గం	పోలైన ఓట్లు	రౌండ్లు
హుస్నాబాద్	2,05,017	22
సిద్దిపేట	1,78,420	20
దుబ్బాక	1,73,366	19
గజ్వేల్	2,31, 086	23

వరికోత మిషన్ దగ్ధం

నవతెలంగాణ-మర్కుక్

వరికోత మిషన్ దగ్ధమైన సంఘటన మండలంలోని శివారు వెంకటాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శివారువెంకటాపూర్ గ్రామానికి చెందిన చల్ల బాలయ్య పొలంలో శనివారం మిషన్ వరి కోస్తున్నారు. ప్రమాదవశాత్తు యంత్రంలో వంటలలో చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మంటలు ఆర్పి ప్రమాదం తప్పిందించారు.



కొత్త ప్రభాకరరెడ్డి గెలుపు తథ్యం



వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట : దుబ్బాకలో కొత్త ప్రభాకర రెడ్డి గెలుపు తథ్యమని వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో బాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆవిర్భావం అనంతరం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రభాకర్ రెడ్డి ఆధ్వ ర్యంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభి వృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ ఆఫీస్ వర్కర్‌గా రెడ్డమైన బాలమణి



నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా సేవా సంఘం ఐటి బెస్ట్ ఆఫీస్ వర్కర్‌గా చింతమడక గ్రామానికి చెందిన రెడ్డమైన బాలమణి అవార్డును అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సేవా సంఘం నిర్వహించి, అనేక కార్యక్రమాల్లో ముందుండి ప్రజల్లో అవగాహన తీసుకొస్తూ, ధైర్యం నింపుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో అవార్డు ఆమె అందుకున్నారు.

విద్యార్థులకు నాసా కిట్స్ అందజేత



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

సిద్దిపేట పట్టణ పరిధిలోని రంగధాంపల్లి శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్ 3 లో నాసా కు చెందిన కిట్స్, బహుమతులను సైన్స్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమార్ శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు శాస్త్ర విజ్ఞానంలో ఆసక్తి పెంపొందింప చేసుకుంటూ గొప్ప శాస్త్రవేత్తలు కావాలని కోరారు. పాఠశాల ఈజీఎం మధు మాట్లాడుతూ.. పిల్లలు చిన్నతనంలోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కొత్త ప్రాజెక్టులను తయారు చేయాలని విద్యార్థులు అసాధారణ ఆలోచనలతో ఏకంగా నాసా దృష్టిని ఆకర్షించాలని పేర్కొన్నారు. అకాడమిక్ డీన్ రాజేంద్రప్రసాద్ నాసా ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రాజెక్టు తయారీ విధానాన్ని ప్రోత్సహిస్తూ దేశానికి అత్యున్నత సేవలు అందిస్తున్న శాస్త్రవేత్తల ప్రాధాన్యాన్ని కూడా తెలుపుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ శ్రీవిద్య కోఆర్డినేటర్ లక్ష్మీనాయుడు అకాడమిక్ డీన్ రాజేంద్రప్రసాద్ ,ఎస్ బ్యాచ్ ఇన్చార్జి హనుమాన్ ,సి బ్యాచ్ ఇంచార్జ్ అశోక్ ,ప్రైమరీ ఇంచార్జ్ మహాలక్ష్మి ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ సరిత, నాసా ఇంచార్జ్ రవీంద్ర చారి, ఏ ఓ రాము పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



నవతెలంగాణ జగదేవపూర్

ప్రకృతి సహజ సిద్ధమైన కొండల్లో వెలసిన ఎత్తయిన నల్లని నాపరాతి గుట్టల మధ్య జగన్మాత శీలాదేవి కొలువైన కొండపోచమ్మ దేవస్థానం తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి గాంచింది. జగదేవపూర్ మండలం పరిదిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో గల కొండపోచమ్మ అమ్మవారి ఆలయం 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమై 5వ తేదీన ముగియనున్నాయి. భక్తుల కోరికలు తీర్చే తల్లిగా విరాజిల్లుతున్న ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రాంతంలో విలసిల్లుతున్న కొండపోచమ్మ తల్లి కొమురవెల్లి మల్లికార్జునస్వామికి స్వయానా చెల్లెలుగా చెబుతుంటారు. కొండపోచమ్మకు ప్రతిఏటా కార్తీక మాసంలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.ఈ వేడుకల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ప్రతిరోజు వస్తుంటారు. హైదరాబాద్,సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్,కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు.23 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్ల చేశారు.

రోజువారీ పూజా కార్యక్రమాలు

ఆలయం వద్ద మూడు రోజులపాటు విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. శనివారం గణపతి పూజ, పుణ్య వాచనం, అఖండ దీప స్థాపన, అగ్ని ప్రతిష్టాపన, మూత్రమంత్ర హవనము, అభిషేకం నిర్వహిస్తారు. ఆదివారం ప్రాతకాల పూజ, మూలమంత్ర హెూమం, స్థాపిత దేవతా పూజ, సామూహిక కుంకుమార్చన, మంగళ హారతి వంటి కార్యక్రమాలు ఉంటాయి.

సోమవారం శివపార్వతుల కల్యాణం

'కొండపోచమ్మ 23వ వార్షికోత్సవ వేడుకలకు ఆలయాని అందంగా ముస్తాబు చేశాం. ఆలయానికి రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగింది. వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశాం' అని ఇఓ మోహన్ రెడ్డి, చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజితరమేష్, ఎంపీటీసీ ల ఫోరమ్ కావ్యదర్గయ్య, ఆలయ సిబ్బంది వెంకట్ రెడ్డి, కనకయ్య, బిఆరెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంచర్ల స్వామి వార్డ్ సభ్యులు ఆలయ అర్చక బృందం సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నవ తెలంగాణ-సిద్దిపేట

ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో శాసనసభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జే పాటిల్ తెలిపారు. ఆదివారం జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల శాసనసభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం జిల్లా ఎన్నికల అధికారి ఇందూర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు రౌండ్ల వారిగా సజావుగా నిర్వహించేందుకు అధికారులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, గజ్వేల్ నియోజకవర్గంలో 321 పోలింగ్ కేంద్రాలు, అత్యధికంగా 44 మంది అభ్యర్థులు ఉన్నందున 23 రౌండ్లలో ఓట్లను లెక్కించాల్సి ఉన్నందున చివరి రౌండు ఫలితం రాత్రి 8 గంటల తర్వాతనే వస్తదన్నారు. మిగతా హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గల ఫలితాలు సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య వచ్చే అవకాశం ఉందన్నారు. లెక్కింపు ప్రారంభమైన తర్వాత ప్రతిగంటకు రౌండ్ల వారిగా ఓట్ల లెక్కింపు ఫలితాలను ఈసీఐ వెబ్సైట్ ద్వారా ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.

అనారోగ్యంతో ఆందోల్ గురుకుల ఇంటర్ విద్యార్థిని మృతి



నవతెలంగాణ - జోగిపేట : ఆందోల్ గురుకుల కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతున్న విద్యార్థిని ఐశ్వర్య అనారోగ్యంతో మృతి చెందారు. జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామానికి చెందిన ఐశ్వర్య నవంబర్ 29న కళాశాలలో అనారోగ్యానికి గురయ్యారు. డిసెంబర్ 1న లేవలేని స్థితిలో ఉన్న ఐశ్వర్యను సంగారెడ్డిలో శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌లో చూపించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ మదినగూడ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్సలు చేస్తుండగా, శనివారం మృతి చెందింది. విద్యార్థి కుటుంబాన్ని అందుకోవాలని, ఎక్స్‌గ్రేషియా రూ.25లక్షలు ఇవ్వాలని, కుటుంబంలో ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు.

పోలింగ్ నమోదులో రాష్ట్రంలో మెదక్ జిల్లా ద్వితీయ స్థానం

నవతెలంగాణ-మెదక్

సాధారణ ఎన్నికలు 2023, మెదక్ జిల్లా పోలింగ్ శాతం నమోదు రెండో స్థానం రావడానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఎంతో కృషి చేశారని జిల్లా స్వీప్ అధికారి బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి శనివారం శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ రాజర్షి ఆద్వర్యంలో స్వీప్ కార్యక్రమల ద్వారా, అనేక కార్యక్రమాలు నిర్వహించారని, అత్యధిక ఓటరు నమోదులో 42 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రతి కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని విజయవంతం చేశారన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా కృషితో పోలింగ్ నమోదులో రాష్ట్రంలో మెదక్ జిల్లా రెండవ స్థానానికి రావడానికి కృషి చేశారని, ఇదే స్ఫూర్తితో రాన్నున ఎన్నికల్లో కృషి చేయాలని కోరారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

- పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం నాడు పిస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిరుధాన్యాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా బాలికలు చిరుధాన్యాలను రోజువారి ఆహారంతో కలిపి తీసుకోవడం అలవాటు చేసుకోవాలి అని తెలిపారు. దానివల్ల తమ ఆరోగ్యానికి సంబంధించి పూర్తిస్థాయిలో పోషకాలు లభిస్తాయని అన్నారు. అలాగే మొలకెత్తిన శనగలు, పెసర్లు తీసుకోవడం వల్ల సమతుల్యమైన ఆహారాన్ని భుజించిన వాళ్ళు అవుతారని అన్నారు . జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకున్న వారే ఉత్తములని తెలిపారు. బాలికలు భవిష్యత్తులో రకరకాల వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ఇప్పటినుండే సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం మంచిదని సూచించారు. కందుల పెసళ్ళు, మొక్కజొన్న లు, ఉలవలు, సజ్జలు, రాగుల వాటి వాటిని తినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్లీవ రాజ్, ఉపాధ్యాయులు,శశికళ, నవనీత, పిటి అనంత రాములు చారి, పీస్ సమస్త కో ఆర్డినేటర్ కొంపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే బీఆర్ఎస్ దాడులు



నవతెలంగాణ-బెజ్జంకి

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్ పథకం ప్రకారమే స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కాంగ్రెస్ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి ఆరోపించారు. దాడిలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన బోనగిరి రాజేందర్‌ను కవ్వంపల్లి సత్యనారాయణ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం పరామర్శి ంచారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడారు. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన సాగర్ పై,బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బోనగిరి రాజేందర్ పై బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడ్డారని నేడు వెలువడే ఎన్నికల ఫలితాల్లో నియోజవర్గ ప్రజలు బీఆర్ఎస్ నాయకులకు దేహశుద్ధి చేస్తారని హితవు పలికారు.దాడులకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులపై పోలీసులకు పిర్యాదు చేశామని క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి దాడులకు పాల్పడిన వారిపై అధికారులు నిష్పక్షపాతంగా చర్యలు చేపట్టాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, ఇల్లంతకుంట ఎంపీపీ వెంకట రమణ రెడ్డి, కాంగ్రేస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు హాజరయ్యారు.

కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ - మెదక్



అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల్లో భాగంగా, నవంబర్ 30వ తేదీన జరిగిన పోలింగ్ అనంతరం ఈనెల 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరుగునున్న కౌంటింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కౌంటింగ్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుల్లు, కౌంటర్లు, మీడియా, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు ఇతరత్రా అన్ని ఏర్పాట్లను నిబంధనలకు లోబడి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాజర్షి షా వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలకు కలిపి జిల్లా కేంద్రంలోని వైపిఆర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి పూర్తి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ర్యాండం ప్రకారం వివి ప్యాట్లలోని స్లిప్పులు లెక్కింపు జరుగుతుందని, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే గ్రామాభివృద్ధి

- గ్రామానికి వైకుంఠ రథం అందజేత



నవతెలంగాణ-నంగునూరు

గ్రామస్తులు ఐకమత్యంగా ఉంటే గ్రామాభివృద్ధి చెందడంతో పాటు దాతలు సహాయం చేసేందుకు ముందుకువస్తారని ఎల్లంకి ఇంజనీరింగ్ సంస్థల చైర్మన్ ఎల్లంకి సదాశివరెడ్డి అన్నారు. నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన ఎల్లంకి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు సదాశివరెడ్డి, సాంబశివరెడ్డి, దయాకర్ రెడ్డి లు శనివారం రూ.10 లక్షల విలువ చేసే వైకుంఠ రథం, బాడీ ఫ్రిజర్ అందజేశారు. ఈసందర్భంగా సదాశివరెడ్డి మాట్లాడుతూ పుట్టిన ఊరికి సహాయం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా సంపాదనలో కొంత గ్రామాభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే సార్ధకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాగుల సారయ్య, సర్పంచ్ పంగ కుమారస్వామి, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఓజాలు, ఏటి పరమేశ్వర్, వేణుచక్రవర్తి, అయిలయ్య, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్, అశోక్, రవి, మల్లేశం, నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ ప్రాథమిక కోన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మండల విద్యాధికారి ఉదయ్ భాస్కర్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణను డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. తరగతుల వారిగా విద్యా ప్రమాణాలను సాధించడంలో విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను, గణితంపై పట్టును చూసి వారిని అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణం చుట్టూ ఉన్న పచ్చని చెట్లు, పూల మొక్కలు, పాఠశాల కిచెన్ షెడ్డును పరిశీలించి, మధ్యాహ్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభ వారి క్రమశిక్షణ అన్నింటిలో పాఠశాల ఆదర్శప్రాయంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయ బృందాన్ని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీలు



నవతెలంగాణ-రాయపోల్

మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ సోదరుడు శివప్రసాద్ పెళ్లి రిసెప్షన్ శనివారం మండల కేంద్రంలోని జీఎల్ఎల్ గార్డెన్‌లో జరిగింది. నూతన వధూవరులను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్,గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి,రాయ పోల్ జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి, సిక్కిం వెంకటయ్య, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, మండల రైతు సమితి అధ్యక్షులు నరసింహారెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రహీమొద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ పడకండి శ్రీనివాస్ గుప్త, ఆత్మ కమిటీ డైరెక్టర్ మురళి గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు అనుమండ్ల రాజిరెడ్డి,ఇప్ప దయాకర్, మాజీ సర్పంచ్ కమ్మరి శ్రీనివాస్ చారి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు కర్నాల సత్యనారాయణ, నాయకులు చింతకింది మంజూర్, మాదాసు నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, దయాకర్ రెడ్డి, యూసుఫ్, ఇప్ప పోచయ్య, బాల్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే



నవతెలంగాణ-జగదేవపూర్

వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని సర్పం చ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు రచర్ల నరేష్ ధీమా వ్యక్తం చేశారు. దొంగ సర్వేల వల్ల ప్రభుత్వం కులదోస్తాం అనుకోవడం విడ్డురం అన్నారు. డబ్బులతో ప్రజలను మోసం చేస్తాము అనుకోవడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్ విజన్ ఉన్న నాయకులు అని తెలిపారు. ప్రతిపక్షాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం గ్రామానికి చెందిన బోడపట్ల తిరుపతి బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమాకమైనట్టు మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తిరుపతికి నియమాకపత్రం అందజేశారు. తన నియమాకానికి సహకరించిన, జిల్లా మండల బీఆర్ఎస్ నాయకులకు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహానికి ఐదు వేల సాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు బీసీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన గౌరబోయిన పద్మ, సంపత్‌ల కుమార్తె పవిత్ర వివాహానికి శనివారం రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. న్యూఢిల్లీలో ఉంటున్న నంగునూరు గ్రామానికి చెందిన డాక్టర్ మంగు ఫణిరాజు నిరుపేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న వెంటనే రూ.ఐదు వేలు పంపించారు. స్పందించిన డాక్టర్ మంగు ఫణిరాజుకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు చౌడుచెర్ల జయపాల్ రెడ్డి,నాయకులు అప్పీసు నర్సింలు,సనాదుల బాల పోశయ్య, దేవులపల్లి కనకయ్య, గౌరబోయిన కనకయ్య, భీమరి కనకరాజు, గౌరబోయిన సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


నిరుపేద వధువుకు పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రం బీసీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన గౌరబోయిన పద్మ - సంపత్ ల కూతురు పవిత్ర వివాహానికి పుస్తె మట్టెలు బహుకరించారు. నిరుపేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న నంగునూరు గ్రామ సర్పంచ్ చౌడుచెర్ల మమత జయపాల్ రెడ్డి నిరుపేద వధువుకు పుస్తె మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గౌరబోయిన కనకయ్య, భీమరి కనకరాజు, నంగునూరు బీఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కనకయ్య, మండల బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సనాదుల బాలపోచయ్య, సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి, దేవులపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని అవుసులోని పల్లి గ్రామంలో అకస్మాత్తుగా మృతి చెందిన గుర్రాల మహేష్ కుటుంబానికి ఆయన చిన్ననాలి స్నేహితులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పదవ తరగతి 2005-06 పూర్వ విద్యార్థులు శనివారం రూ.23 వేల ఆర్థిక సహాయాన్ని మహేశ్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ స్నేహితుడు మహేష్ మరణం తమకు తీరని లోటన్నారు. భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామి, శ్రీశైలం, పరశురాం తదితరులు పాల్గొన్నారు

తీవ్ర ఉత్కంఠ..



పటాన్‌చెరులో గెలుపుపై అభ్యర్థుల ఆందోళన

- సైలెంట్ ఓటింగ్‌తో అయోమయం
- గెలుస్తున్నామంటూ పైకి చెబుతున్నా.. లోలోపల తీవ్ర భయం

నవతెలంగాణ-రామచంద్రాపురం

2023-శాసనసభ ఎన్నికల గెలుపుపై పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పైకి ఎవరికి వారు గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ లోపల మాత్రం భయం వెంటాడుతూనే ఉన్నది. సైలెంట్ ఓటింగ్‌తో గెలుపు ఎవరిని వరిస్తుందో పక్కాగా తేల్చుకోలేక ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 3,97,237 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 2,77,568 మంది ఓటు హక్కును వినియోగించుకు న్నారు. 1,19,669 మంది అసలు ఓటే వేయకపోవడంతో 69.87 శాతం మాత్రమే ఓటింగ్ నమోదు అయింది. దాంతో ఓటర్ల నాడీ తెలుసుకోవడం ప్రధాన పార్టీ అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా అధికార పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తాను గెలుస్తానని నూటికి నూరు శాతం ఆశా భావం వ్యక్తం చేస్తున్నాం. కానీ కిందిస్థాయి బీఆర్ఎస్ నాయకులు ఆశించిన స్థాయిలో ఓట్లను రాబట్టుకోవడంలో విఫలం చెందారని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు విచ్చలవిడిగా నాయకుల వద్దకు చేరినప్పటికీ అవి కింది స్థాయి వరకు చేరలేదని దానివల్ల ఓట్లు ఎంతమేరా బీఆర్ఎస్ పార్టీకి పడుతాయో అని ఆందోళనలో ఉన్నారు. డబ్బులు, మద్యం, విందులు అన్ని పెద్ద మొత్తంలో అధికార పార్టీ చేసినప్పటికీ ఓట ర్లను మలుచుకోవడంలో ఆశించిన స్థాయిలో చేయ లేదని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మీద వ్యతి రేకత వలన ఉద్యోగులు, నిరుద్యోగులు బీఆర్ఎస్‌కు మొగ్గు చూపలేదని తెలుస్తున్నది. కానీ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు తమకు లాభిస్తుందని తమకే ఓట ర్లు అధిక శాతం ఓట్లు వేశారని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం మీద వ్యతిరేకత స్థానిక ఎమ్మెల్యే మీద ఉన్న వ్యతిరేకత వల్ల తమదే గెలుపు అని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నా రు. అధికార పార్టీ విచ్చలవిడిగా డబ్బులను పంచిన ప్పటికీ ఓటర్లు వాటిని తీసుకొని తమకే ఓటు వేశారని చెబుతు న్నారు. ప్రచారంలో తన మీద ప్రజలు చూపిన సానుభూతి తప్పకుండా తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ పారీ అభ్యర్థి అంటున్నారు. బీఎస్పీకి ఎంత ఎక్కువ ఓట్లు వస్తే.. కాంగ్రెస్ పార్టీ విజయానికి అంత ఎక్కువ ఆశలు ఉంటాయని అంచనా. బీఎస్పీకి వచ్చే ఓట్లు అధిక శాతం బీఆర్ఎస్ పార్టీకి చెందినవే అవుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఇతర పార్టీల ఓట్లను బట్టి ఎవరు గెలుస్తారో వేచి చూడాలి.

జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు.. రాష్ట్రస్థాయి అవార్డులు

- కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మూడు, ఓ ప్రయివేటు సంస్థ ఆధ్వర్యంలో ఒకటి మొత్తంగా నాలుగు..
- అందరి కృషితోనే ఇది సాధ్యం : సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. కేంద్ర ఆరోగ్య శాఖ నియమించి మూడు కమిటీలతో పాటు.. ఓ ప్రయివేటు సంస్థ కలిసి మొత్తంగా నాలుగు అవార్డులను జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు అందజేశారు. కాగా అందరి కృషితోనే ఈ అవార్డుల పంట పండిందని ఆ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ శేషులు అన్నారు. శనివారం స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సిబ్బంది వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నర్సులు అందరి కృషితోనే రాష్ట్రస్థాయిలో అవార్డులు సాధించామన్నారు. కేంద్ర ప్రభుత్వ బృందం నియమించిన కమిటీలు రాష్ట్రస్థాయిలో అన్ని వైద్యశాలలను పరిశీలించి జహీరాబాద్ వైద్యశాలకు నాలుగు అవార్డులు ఇచ్చాయ న్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నియమించిన ఈ మూడు కమిటీలతో పాటు, మరో ప్రయివేటు సంస్థ జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి అవార్డు ప్రకటించినట్టు తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నియమించిన ఎన్క్యాస్, ముస్కాన్, లక్ష్య ప్రోగ్రాములలో జాహీరాబాద్ ఏరియా ఆసుపత్రి చెక్‌లిస్ట్ ప్రకారం 90 శాతం అన్ని నిబంధనలు పాటించినందున.. ప్రతీయేడు ఈ ఆసుపత్రికి రూ.25 లక్షల చొప్పున మూడేండ్ల పాటు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. దాంతోపాటు ఆసుపత్రికి ప్రశంసా పత్రం ఇచ్చారని వివరించారు. ఢిల్లీకి చెందిన బీఎఫ్‌హెచ్ అనే ప్రయివేటు సైతం ఇక్కడ రోగులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డు అందజేసినట్టు వివరిం చారు. తమ ఆసుపత్రిని కేంద్ర ఆరోగ్య శాఖ బృందం నందర్శించి పనితీరుకు సంతృప్తి చెంది అవార్డులు అందజేయడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇకముందు కూడా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించి మంచి పేరు తెచ్చుకుంటామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వైద్యశాలలో పనిచేస్తున్న స్వీపర్ నుంచి సూపరింటెండెంట్ వరకు అందరూ కృషి చేయడంతోనే ఈ అవార్డులు సాధ్యమయ్యాయన్నారు. ఆసుపత్రికి కేంద్ర బృందం గుర్తింపు ఇవ్వడానికి ఎంతో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఆరోగ్యశాఖ కమిషనర్, జిల్లా వైద్యాధికారి, డిసిహెచ్ ఎస్‌లకు వారు కృతజతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ మహిళ వైద్య నిపుణురాలు డాక్టర్ కిరణ్ మై, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆదినారాయణను దర్శించుకున్న కెఎస్‌జీ

నవతెలంగాణ-జిన్నారం

పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎమ్మెల్యే అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్ సతీ సమేతంగా మండల పరిధిలోని శ్రీదేవి భూదవి సమేత ఆదినారాయణ స్వామి ఆలయాన్ని శనివారం ప్రత్యేకంగా దర్శించు కున్నారు. పటాన్చెరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఎన్నికల్లో తన విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీటీసీ లావణ్య నరేష్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆయ న్ను వావిలాల, సొలక్‌పల్లి, జిన్నారం కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యే కంగా కలిశారు. ఆయా ప్రాం తాల్లో దేవాలయాలను శ్రీనివాస్‌గౌడ్ బృందం దర్శించుకున్నారు.



పాస్టర్ మృతి తీరని లోటు

నవతెలంగాణ-జహీరాబాద్

ఇండిపెండెంట్ పాస్టర్స్ ఫెల్లోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ జి.రాజేందర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు శనివారం ఆసుపత్రికి వెళ్లి.. పాస్టర్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. ఆయన మృతి తీరని లోటు అంటూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కాటాను కలిసిన బొల్లారం కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కాంగ్రెస్ పార్టీ పటాన్చెరువు అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్‌ను ఆయన నివాసంలో.. బొల్లారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కౌన్సిలర్ పుల్లగూర్ల లక్ష్మారెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలింగ్ సరళిపై చర్చించారు. తమదే గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు మునీర్, తహీర్, సైహైల్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో విధులు నిర్వహించిన 'ఆశా'లకు వేతనమివ్వాలి

నవతెలంగాణ-జహీరాబాద్

2023-శాసనసభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశా వర్కర్లకు ఎన్నికల డబ్బులు ఇప్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓకు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.మహిపాల్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని డిఎంహెచ్వో కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయమై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయ సిబ్బంది హామీ ఇచ్చారని మహిపాల్ తెలిపారు.



పాఠశాల ఆయమ్మకు జీతం అందజేత

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆయమ్మ పద్మమ్మకు రూ.10,000 నెల జీతాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తరపున అలాగే తనవంతు సాయం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.



దివ్యాంగుల పాఠశాలను సందర్శించిన జడ్జి

నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్ రావు సూచనలతో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జే.హనుమంత్ రావు శనివారం సబిత దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల బాగోగులను తెలుసుకొని వారికి అన్ని రకాల సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వారిని చిన్నచూపు చూడకుండా వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి సరైన మార్గంలో ఉండేటట్టు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కవిత దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి పీఎన్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన కొండా గంగయ్య శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలిసి.. పీఎన్ ఫౌండేషన్ చైర్మెన్ బూరుగడ్డ రాకేష్ రాజ్ శనివారం మృతుని దహనసంస్కారాల కోసం రూ.5,000 గంగయ్య తనయుడు కొండా అయిషయకు అందజేశారు. ఈ సందర్భంగా రాకేష్ రాజ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం పిఎన్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుండి సహాయ సహకారాలను అందిస్తున్నదన్నారు. కుల మతాలకు అతీతంగా పీఎన్ ఫౌండేషన్ ఎన్జీఓల్లుగా ప్రజలకు సేవలు చేస్తున్నదన్నారు.



జోరుగా బెట్టింగ్..

కాంగ్రెస్‌దే అధికారం అంటూ ఒకరు.. బీఆర్ఎస్‌దే అంటూ ఇంకొదరు

జహీరాబాద్‌లోనూ భారీ బెట్టింగ్‌లు!

నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్రంలో అధికార పగ్గాలపై బెట్టింగ్‌ల దందా జోరుగా సాగుతున్నది. జహీరాబాద్ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుపై కూడా భారీ బెట్టింగ్ జరుగుతున్నట్టు సమాచారం. అభ్యర్థుల భవిత్యాన్ని ఓటర్లు ఈవీఎంల్లో భద్రపరిచినప్పటికీ.. గెలుపై మాత్రం లోకల్‌గా భారీ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు బూత్ స్థాయి నాయకుల నుంచి రిపోర్టులను తెప్పించుకొని బేరీజులు వేసుకుంటూ మెజార్టీ, గెలుపోటముల ఓ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమది అంటే తమదే విజయమని స్పష్టం చేస్తున్నారు. గెలుపోటములపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న ఈ నేపథ్యంలో.. భారీ బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనున్నట్టు వివిధ ఎగ్జిట్ పోల్స్ తెలిపినప్పటికీ.. ఈ ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్నికల ముందు నిర్వహించినవే కనుక ఎన్నికలకు రెండ్రోజులు ముందు ఓటింగ్ మేనేజ్మెంట్ గురించి వారికి తెలియదని.. మరోమారు పక్కా విజయం తమదే అని అధికార పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. దాంతో అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లపై చాలామంది బెట్టింగ్‌లు కాస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గం స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకూ పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇరు పార్టీల మధ్య తగ్గపోరు ఉండడంతో.. గతంలో ఎన్నడూ లేనంతగా బెట్టింగ్‌లు సాగుతున్నట్టు పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఈసారి అధికారం ఎవరిది అనే విషయంపై నేటి మధ్యాహ్నం లోపు స్పష్టంగా తెలియనున్నది.

పేదింటికి పెద్దకష్టం..



ఇంటికి పెద్ద దిక్కైన యువకుడికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

- లక్షలు ఖర్చు పెట్టినా నయం కాని ఆరోగ్యం
- మెరుగైన వైద్యం కోసం మరో రూ.15 లక్షలు అవసరం
- నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- 9666540004కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం అందించాలని వేడుకోలు

నవతెలంగాణ-దుబ్బాకరూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన మద్దెల కనకయ్య, యాదవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు సంతానం. చిన్న కొడుకు పుట్టుకతోనే అంగవైకల్యం కలిగి ఉండేవాడు. యాదవ్వ బీడీలు చుడుతూ.. కనకయ్య తనకున్న కొద్దిపాటి వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. అయితే వారి పెద్ద కొడుకు రాజశేఖర్ వారి కుటుంబానికి పెద్ద దిక్కుగా మారి.. కుటుంబ పోషణ చూసుకునేవాడు. మల్లన్నసాగర్ కెనాల్ మరమ్మతు పనులు, సిద్దిపేట నుంచి తొగుట కొత్తరోడ్డు పనులు చేసే కూలీలకు భోజనం పార్సిల్స్ తీసుకురావడం.. వారికి అవసరమైన వంట సామగ్రి అందజేస్తూ వచ్చిన డబ్బులతో కుటుంబ పోషించేవాడు. అయితే తొగుట మండలంలోని పెద్దమాసాన్‌పల్లిలో గల ఎల్లమ్మ ఆలయంలో బంధువులు చేసిన ఓ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా.. రాజశేఖర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు మరమ్మతు పనులు జరుగుతుండడంతో ప్రమాదవశాత్తు అతని బైక్ పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి సీ3, సీ4 వెన్నుముక పూర్తిగా దెబ్బతిన్నది. ఛాతి నుంచి కింది భాగం(కాళ్ళు ,చేతులు) పూర్తిగా కదలించలేని పరిస్థితి ఏర్పడింది. తొలుత సిద్దిపేటలోని క్రిటికల్, ఆ తర్వాత హైదరాబాద్లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. దాదాపు రూ.5లక్షలకు పైగా వైద్యానికి ఖర్చు అయ్యాయి. అక్కడి నుంచి బేగంపేటలోని గుడ్ లైఫ్ రిహాబిలేషన్ సెంటర్ తీసుకెళ్లగా.. 6 రోజులకు గానూ రూ.1.20 లక్షలు ఖర్చు అయ్యాయి. అయితే కండిషన్ క్రిటికల్ అవడంతో మళ్లీ నిమ్స్ హాస్పిటల్ ఆ తర్వాత కొన్ని రోజులకు తిరిగి బేగంపేటలోని క్యూర్ రిహాబిలేషన్ సెంటర్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా రోజుకు వైద్యం, మందులకు కలిపి రూ.5000 ఖర్చు అవుతు న్నదని రాజశేఖర్ తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికే బంధువుల సహాయంతో రూ.15 లక్షల వరకు అప్పులు చేసి వైద్యం చేయించామన్నారు. అయినప్పటికీ మరో మూడు నెలలు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలోనే డాక్టర్లు చెప్పారని.. అందుకు ఇంకో రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వాపోతున్నారు. ఇప్పటికే అప్పు చేసి వైద్యం చేయించామని.. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని ఈ పరిస్థితుల్లో ఇంకో రూ.15లక్షలు ఎక్కడినుంచి తీసుకురావాలని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కొడుకును కాపాడాలని వేడుకుంటున్నారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నారు. సాయం చేయాలనుకునే వారు 9666540004 నెంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం అందించాలని వేడుకుంటున్నారు.

రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం వారిది. తల్లి బీడీలు చుడుతూ.. తండ్రి తమకున్న కొద్దిపాటి వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. దాంతో ఆ ఇంటికి వారి పెద్ద కొడుకే పెద్ద దిక్కై.. కుటుంబ పోషణ చూసుకునేవాడు. మల్లన్నసాగర్ కెనాల్ మరమ్మతు పనులు, సిద్దిపేట నుంచి తొగుట కొత్తరోడ్డు పనులు చేసే కూలీలకు భోజనం పార్సిల్స్ తీసుకురావడంతో పాటు.. వంట సామగ్రిని తీసుకురావడం లాంటి పను లు చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచాడు. అయి తే అనుకోని రోడ్డు ప్రమాదంలో ఆ యువకుడు తీవ్ర గాయాలపాలై.. ఆసుపత్రిలో చేరాడు. చికిత్స కోసం అప్పులు చేసి లక్షలు ఖర్చు పెట్టినా.. ఇప్పటికీ పూర్తిగా ఆరోగ్యం కుదుటపడ లేదు. మెరుగైన ఆరోగ్యం కోసం ఇంకా సుమారు రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుం దని వైద్యులు చెప్పడంతో.. ఆ పేద కుటుంబం తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూ స్తున్నారు. తమ కుమారుడికి మెరుగైన ఆరోగ్యం కోసం దాతలు సాయం చేయాలని వేడుకుంటున్నారు.

స్నేహితులు రూ.30 వేల సాయం

రాజశేఖర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న అతడి పదో తరగతి స్నేహితులు వైద్యం కోసం రూ.30 వేలు జమ చేసి అతడి తల్లిదండ్రులకు అందించారు. అవసరమైతే మరింత సాయం చేయడానికి తాము ముందు ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు.

నా బిడ్డను కాపాడండి..



మాది చాలా నిరుపేద కుటుంబం. నా పెద్దకొడుకే కుటుంబానికి పెద్ద దిక్కు. ఇప్పుడు తనే ఆసుపత్రి పాలయ్యాడు. ఇప్పటివరకు అప్పు చేసి వైద్యం చేయించాం. మరో రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెబుతున్నారు. చేతిలో పైసా లేదు. దిక్కు తోచని స్థితిలో ఉన్నా. నా బిడ్డ వైద్యానికి ప్రభుత్వం సాయం అందించాలి. దాతలు కూడా స్పందించి.. నా బిడ్డకు పునర్జన్మను ఇవ్వండి. మీకు తోచిన కాడికి సాయం చేయండి.

– యాదవ్వ, రాజశేఖర్ తల్లి

పటిష్ట బందోబస్తు

- స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద మూడంచెల విధానంలో బందోబస్తు ఏర్పాట్లు
- నేటి ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్
- కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి
- జిల్లా అదనపు ఎస్పీ డా.అశోక్

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్స్, గీతం యునివర్సిటీ వద్ద జిల్లా పోలీసులు, కేంద్ర బలగాలు 500 మందితో మూడంచెల విధానంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని జిల్లా అదనపు ఎస్పీ డా. పి.అశోక్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని 5 నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి నేటి ఉదయం 8 గంటల నుంచి గీతం యూనివర్సిటీ, రుద్రారంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానున్నదన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్, భద్రతా పరమైన సమస్యలు తలెత్తకుండా ఆర్మ్డ్ రిజర్వ్, స్థానిక పోలీస్ బలగాలు 500 మందితో మూడంచెల విధానంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే వారికి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నియోజకవర్గాల వారిగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలో వాహనాలను పార్కింగ్ చేసే విధంగా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, బాణాసంచా, లైటర్ల వంటి నిషేధిత పేలుడు పదార్థాలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకుండా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట పరిసరాలు అన్ని సీసీ కెమెరాల నిఘా నేత్రంలో ఉంటాయన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. సంఘవిద్రోహ శక్తులెవరైన కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించాలని చూస్తే.. చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు.



రేపు ఉదయం 6 గంటల వరకు 144సెక్షన్..

జిల్లా వ్యాప్తంగా నేటి ఉదయం 6:00 గంటల నుంచి రేపు ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని అదనపు ఎస్పీ తెలిపారు. కాబట్టి నలుగురు కానీ అంతకంటే ఎక్కువమంది కానీ గుంపులు గుంపులుగా తిరగొద్దన్నారు. పార్టీ జెండాలు, కండువాలు, గుర్తులు, ప్లాకార్డ్స్ ధరించొద్దన్నారు. ప్రదర్శించొద్దని, మైకులు, లౌడ్ స్పీకర్లు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులకు, అనుమతి లేదన్నారు. ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతీ ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని, గుర్తింపు కార్డులను కలిగి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు.

ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మాసానగర్ కాలనీకి చెందిన సయ్యద్ జమీల్ ఆయన సోదరుడు సయ్యద్ ముస్తఫాలు పవిత్ర ఉమ్రా యాత్ర కోసం వెళ్తున్న నేప థ్యంలో.. వారికి స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వారి ఇంటికి వెళ్లి పూల మాలలు, శాలువతో సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులందరికి తరపున దర్శనం చేసుకొని.. ప్రపంచం శాంతిని కాంక్షిస్తూ ప్రార్థనలు చేయాలని చెప్పారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని.. వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు పండాలని కోరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ మాంకల్ సుభాష్, శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాములు నేత, మోతీరం,యానిస్, యూంగిర్, అబ్దుల్లా, నాయకులు అలీ, అక్రమ్ తదితులున్నారు..

